

వైఎస్ఆర్

ఉరుసు ఉత్సవాలకు సిఎంను ఆహ్వానించిన పీఠాధిపతి

ప్రజాశక్తి - కడప అర్బన్

అమీన్ పిర్ (పెద్ద దర్గా) దర్గా ఉరుసు ఉత్స వాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని ఆహ్వానించారు. శుక్రవారం విజయవాడ తాడేపల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. డిసెంబర్ 6 నుంచి 12 వరకు ఉరుసు ఉత్సవాలు ఉంటాయని పీఠాధిపతి సిఎంకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీ అవినాష్ రెడ్డి, ఆరిఫుల్లా హుస్సేనే శిష్యులు పాల్గొన్నారు.



సిఎంను ఆహ్వానిస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని

ఐసిడిఎస్‌లో ఆడిట్ గుబులు!

- నాలుగేళ్ల నాటి పద్దులపైనా ఆరా
- కడప, మైదుకూరు ప్రాజెక్టులు పూర్తి
- పులివెందుల్లో కొనసాగుతున్న వైనం

జిల్లా స్త్రీ,శిశుసంక్షేమశాఖకు ఆడిట్ గుబులు పట్టుకుంది. 2018-2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట, అనంతరం రెండేళ్లపాటు కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో ఆడిట్ వాయిదా పడినట్లు తెలిసింది. నాలుగేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన కేటాయింపులు, ఖర్చులు, వ్యయాలపై విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురు సభ్యుల ఆడిట్ బృందం సీరియస్‌గా దృష్టి సారించింది. 20 రోజులు ఆడిట్ బృందం కడపలో మకాం వేసి సంబంధిత రికార్డుల తనిఖీలు చేపట్టింది. కడప, మైదుకూరు ప్రాజెక్టుల ఆడిట్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. నాలుగేళ్ల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యయం చేసిన ఖర్చుల వివరాలను ఆరా తీస్తుండడంతో అప్పుడు ఎవరు బాధ్యులుగా ఉన్నారో తెలియడం లేదని, ప్రతియేటా చేయాల్సిన ఆడిట్‌ను చేయకుండా ఇప్పుడు చేయడం వల్ల ఎవరు ఇబ్బందులు పడతారో తెలియడం లేదనే ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



వైఎస్ఆర్ కడప జిల్లాలో 12 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలోని 2,212 గ్రామీణ అంగన్వాడీ కేంద్రాలు, 177 మినీ అంగన్వాడీ కేంద్రాలతో కలిపి లెక్కిస్తే 2,389 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఓ మండలమైన చక్రాయపేట, పోరుమామిళ్ల, బద్వేల్, ముద్దనూరు, పులివెందుల, కడప రూరల్, కడపఅర్బన్, ప్రొద్దుటూరు రూరల్, ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి ద్వారా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా 15,870 మంది గర్భిణులు, 14,211 మంది బాలింతలకు, 47,355 మంది పిల్లలకు ఒకపూట సంపూర్ణ భోజన సదుపాయాన్ని అందిస్తున్న సంగతి తెలిసిందే. వైఎస్ఆర్ సంపూర్ణ కిట్స్, అంగన్వాడీ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, బాలల పరిరక్షణ యూనిట్, బాలసదనములు, శిశుగృహ, సఖిదిశ సెంటర్, గృహహింస రక్షణ చట్టం మొదలగు కార్యకలాపాలను పర్య వేక్షిస్తున్న సంగతి తెలిసిందే. స్త్రీ, శిశుసంక్షేమానికి చేసిన కేటాయింపులను, వ్యయాలను నాలుగేళ్లుగా ఆడిట్ చేయకపోవడం భారంగా మారింది. తాజాగా పులివెందుల ఐసిడిఎస్ ప్రాజెక్టు పద్దుల వివరాలను ఆడిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ప్రాజెక్టును రోజుల తరబడి ఆడిట్ చేస్తుండడం పట్ల ఉద్యోగుల్లో గుబులు రేగుతోంది. ఆడిట్ ప్రక్రియ రోజుల తరబడి సాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని 12 ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో కడప, మైదుకూరు మినహా మిగిలిన 10 ఐసిడిఎస్ ప్రాజెక్టుల ఆడిట్ ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఆడిట్ సభ్యుల ఖర్చులను భరించడంపై ఐసిడిఎస్ ప్రాజెక్టులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా టిఎ, డిఎల బిల్లులు సైతం మంజూరు చేయని పక్షంలో ఖర్చులు భరించడానికి ఆపసోపాలు పడుతున్నట్లు తెలిసింది.

రహదారుల భద్రతతో ప్రాణ రక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కలెక్టర్ విజయ్‌రామరాజు

రహదారుల భద్రతతో ఎన్నో ప్రాణాలను కాపాడిన వారమవుతామని రహదారుల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న పటిష్టమైన చర్యలను విధిగా అమలు చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కడప నగరపాలక కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. పోలీస్, రవాణా, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖల అధికారులు ఐరాడ్ ద్వారా ప్రతీ రోడ్డు ప్రమాదానికి గల కారణాలను, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు విధిగా నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. అతివేగంతో వాహనాలు నడపడం, రోడ్లపై బైకుల విన్యాసాలు చేయడం వంటి సందర్భాలు కనిపించకూడదన్నారు. ఈ విషయంలో రహదారుల భద్రతా సమన్వయ కమిటీ అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అతివేగంగా బైకులు నడిపే కుర్రాళ్ళపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలన్నారు. స్కూల్ జోన్లలో రహదారుల భద్రత, ట్రాఫిక్ రూల్స్ తెలిపే గుర్తులను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, కమిటీ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆటిఒ సుశీల, కడప డిఎస్‌పి వెంకట శివారెడ్డి, డిఎంహెచ్ఒ. నాగరాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ రెగ్యులర్ డిఇగా ఖాసీంసాహెబ్

కడప రెగ్యులర్, అన్నమయ్య ప్రాజెక్టు విభాగాలకు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



బాధ్యతలు చేపడుతున్న డిఇ ఖాసీంసాహెబ్

జిల్లా నీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజి నీర్‌గా ఖాసీం సాహెబ్ నియమి తులయ్యారు. ఆయన శుక్రవారం కడప రెగ్యులర్, అన్నమయ్య ప్రాజెక్టులకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కడప రెగ్యులర్ డిఇగా విధులు నిర్వహించారు. ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో మూడు నెలల కిందట చోటుచేసుకున్న బదిలీల కారణంగా రెగ్యులర్ డిఇ స్థానం నుంచి తెలుగుగంగ ప్రాజెక్ట్ విభాగానికి బదిలీపై వెళ్లారు. అనంతరం చేర్పుల, మార్పుల నేపథ్యంలో కడప రెగ్యులర్, అన్నమయ్య ప్రాజెక్టులకు డిఇగా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల సహకారంతో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ రవికిరణ్, డిఇలు మురళీకృష్ణ, రమణయ్య, జయచంద్రారెడ్డి, ఎఇలు సునీల్, హేమంత్, రామమునయ్య, నాయక్, రెగ్యులర్, అన్నమయ్య ప్రాజెక్ట్ విభాగాలకు చెందిన పలువురు సహచర ఇంజినీర్లు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి



మాట్లాడుతున్న నీలిశ్రీనివాసరావు

కడప : డాక్టర్ తులసిరెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు వై. విష్ణు ప్రీతం రెడ్డి అన్నారు. శుక్రవా రం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మూడేళ్లుగా విశేష సేవలందించిన మూడు సంవత్సరాలు విశేష సేవలు అందించిన తులసిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం రాష్ట్ర మీడియా, సోషల్ మీడియా చైర్మన్‌గా పదోన్నతి కల్పించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు రావాలని వారు అభిలషించారు. విలేకరుల సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు మధురెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళబాబు, యువజన కాంగ్రెస్ నాయకులు విజయ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

ఎవరు పిలిచినా 'పుత్తా' పలుకుతారు



మాట్లాడుతున్న మన్సూరు అక్బర్

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహా రెడ్డి అన్యాయం జరిగిందని ఎవరూ పిలిచినా వస్తారని, ప్రజల పక్షాన పోరాటం చేస్తారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్‌లోని తన కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి జిల్లా అధికార ప్రతినిది రాజేంద్రనాథరెడ్డి పుత్తా నరసింహారెడ్డిని ఎలా వస్తావు అంటూ మాట్లాడడాన్ని ఖండించారు. పక్కా ఆధారాలతోనే పుత్తా మాట్లాడుతారని చెప్పారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారన్నారు. పదవిలో లేనప్పటికి 2014 నుంచి 2019 వరకు కమలాపురంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేశారని తెలిపారు.

నూతన టెక్నాలజీపై అవగాహన ఉండాలి

కడప సిటీ : విద్యార్థులకు నూతన టెక్నాలజీలపైనా అవగాహనతోపాటు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ పెంచుకోవాలని ప్రిన్సిపల్ ఆర్. వీర సుదర్శనరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో కోయంబత్తూర్‌కు చెందిన ఫేస్ కంపెనీ వారు మొదటి సంవత్సరం విద్యార్థులు లింక్డ్ ఇన్ ప్రోగ్రాంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా ఇంటర్న్‌షిప్ అవకాశాలు పొందవచ్చన్నారు. వర్క్‌షాపులో విద్యార్థులు అవగాహన కల్పించిన్న రిసోర్స్ పర్సన్స్ సంగీత, రోషన్, ప్రియదర్శి నికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిఎస్‌ఎం విభాగాధిపతి పి.ఎ రమేష్, ఎస్. ఇలియాస్ అలీ, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టేందుకే సామాజిక తనిఖీ

కాశినాయన: గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని డిఆర్‌పి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నరసాపురం, మిద్దల మూలపల్లె, నరసన్నపల్లె గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలిసి ఉపాధి పనులను తనిఖీ చేపట్టారు. ఉపాధి కూలీలను కలసి పనులపై ఆరా తీశారు.

జమీల్ సోదరునికి శ్రీనివాసరెడ్డి పరామర్శ

కడప అర్బన్ : వైసిపి రౌడీ మూకల దాడిలో గాయపడిన తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంట్ కార్యదర్శి జమీల్ సోదరుడు ముస్తాక్‌ను శుక్రవారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటి సిఎం అంజద్ బాషా తమ్ముడు అహ్మద్ బాషా 50 మంది రౌడీలతో 10 రోజుల కిందట టిడిపి పార్లమెంట్ కార్యదర్శి జమీల్‌పైన దాడికి పాల్పడ్డారని తెలిపారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌కు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో అధిక వర్షాలు, వరదల బారిన పడి నష్టపోయిన రైతాంగానికి స్వల్పఊరట లభించనుంది. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం శుక్రవారం వాతావరణ ఆధారిత వైఎస్ఆర్ ఫ్రీక్రాప్ ఇన్సూరెన్స్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు స్టేట్ లెవల్ కో-ఆర్డినేషన్ కమిటీ పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. 2022 ఖరీఫ్, 2022-23 రబీ సీజన్ల వారీగా నష్టపోయిన రైతాంగానికి పరి హారం వర్తించే అవకాశాలు ఉన్నాయి. ఇందులోభాగంగా ఖరీఫ్ సీజన్‌లో వైఎస్ఆర్ కడప జిల్లాలో బత్తాయి, వేరుశనగ, అన్నమయ్య జిల్లాలో వేరుశనగ, టమోటా పంట లను ఎంపిక చేసింది. ఇందులో బత్తాయికి రూ.1.20 లక్షలు, వేరుశనగకు రూ.62,500 బీమా సదుపాయాన్ని వర్తింపజేసినట్లు తెలిసింది. 2022-2023 రబీ సీజన్ లో కడప జిల్లాలో అరటి, అన్న మయ్య జిల్లాలో అరటి, టమోటా పంటలను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇందులో అరటికి రూ.1, 51, 250, టమో టాకు రూ.75,000 వరకు బీమా సదుపాయాన్ని వర్తింపజేసినట్లు సమాచారం.

వైద్య ఆరోగ్య శాఖలో రీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్‌డి కోటేశ్వరి

కడప సిటీ : స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆర్‌డి కోటేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం రీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాఫ్ నర్సులకు రీకౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు కౌన్సెలింగ్ నిర్వహి ంచమన్నారు. మొత్తం 119 మందికి కౌన్సెలింగ్‌కు హాజరు కాగా 47 మంది మాత్రమే కౌన్సెలింగ్‌లో కోరుకున్నారని పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసమానంగా ఉన్న ఉద్యోగుల సంఖ్యను సమానంగా 14కు కుదిస్తూ ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సేవలు అందజేయనున్నారని పేర్కొన్నారు. ఒకరు ఓపి సేవలు నిర్వహణకు, మరొక వైద్యుడు క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ పిజిషియన్ సేవలను పర్యవేక్షించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీను, సీనియర్ అసిస్టెంట్లు రాఘవేంద్రరావు, రామాంజనేయులు, ఎం.శ్రీనివాసులు, కరుణాకర్, సిబ్బందిపాల్గొన్నారు.


బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డిజిఎం జునారోజులి

కడప అర్బన్ : ప్రజలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు సద్వినియోగం చేసుకోవాలని డిజిఎం జూనా రోజులి కోరారు. శుక్రవారం ఖాతాదారులకు జన సురక్ష పథకాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 599 రోజులకు 7.5శాతం వడ్డీ ఇస్తున్నామని పేర్కొన్నారు. 18 సంవ త్సరాల లోపు వారికి ముస్కాన్ పొదుపు ఖాతా, రికరింగ్ డిపాజిట్‌తో టర్మ్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం విజయ విహారి, ప్రాంతీయ అధికారి భాస్కర్, ఉపాధికారి సుధాకరరావు, ఐటిఐ సర్కిల్ మేనేజర్ ప్రభాకర్, ఎల్ఐసి డివిజనల్ మేనేజర్ అంపయ్య పాల్గొన్నారు.

వెండి రోలింగ్ ట్రోఫీ అందజేత



విసికి ట్రోఫీని అందజేస్తున్న సుబ్బానాయుడు

కడప అర్బన్ : మహిళా జట్టును క్రీడా పోటీల్లో ప్రోత్స హించేందుకు సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత ఒంటిగారి సుబ్బానాయుడు, కుమారుడు సుధీర్ రూ.80 వేలు విలువచేసే వెండి రోలిం గ్ ట్రోఫీని శుక్రవారం వైవీయూ విసి సూర్య కళావతికి అందించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ ఒంటిగారి రామలక్షుమ్మ స్మారకార్థం ట్రోఫీని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజి స్ట్రార్ విజయ రాఘవప్రసాద్, క్రీడాబోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత

కడప అర్బన్ : 2003 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కె. కొండయ్య సిద్దవటంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అదే బ్యాచ్‌కు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు తమ వంతు సాయంగా రూ. 1,82,000 నగదును సేకరించారు. మొత్తం నగదును మృతుని ఇద్దరు పిల్లల పేరు మీద ఫిక్సెడ్ డిపాజిట్ చేసి శుక్రవారం బాండ్లను ఎస్‌పి అన్బురాజన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో కానిస్టేబుల్ సతీమణి కె.సుభాషిణికి అందజేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

కడప అర్బన్ : ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని పాఠశాల ప్రాంతీయ సంచాలకులు జోన్-4 ఎం.వి.కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లర్నింగ్ ఇంప్లిమెంట్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హించిన బేస్ లైన్ పరీక్ష ఆధారంగా విద్యార్థులలో సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఉపాధ్యాయులందరూ శిక్షణ పొందిన అంశాలను తరగతి గదిలో అమలు చేయాలని ఆదేశించారు.

జల్ జీవన్ లక్ష్యాన్ని అధిగమించాలి

కడప అర్బన్ : జిల్లాలో జల్ జీవన్ మిషన్ లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా అమలవుతున్న తాగునీటి కుళాయి కనెక్షన్ పనుల పురోగతిపై శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా గ్రామీణ ప్రాంతాలు, నూతనంగా ఏర్పాటయిన జగనన్న కాలనీలలో తాగునీటి పథకాల పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జగనన్న కాలనీల్లో తాగునీటి సరఫరా, డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణను పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. సమావేశంలో డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వీరన్న, ఇఇలు, డిఇలతోపాటు అన్ని మండలాల ఎఇలు పాల్గొన్నారు.

అందుబాటులో డ్రైవింగ్ రిజిస్ట్రేషన్ కార్డులు

కడప : డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కార్డులు రవాణా శాఖ కార్యాలయం, విజయవాడ నుంచి సరఫరా లేనందున కడప రవాణా శాఖ కార్యాలయంలో ప్రింటింగ్ చేయడం లేదని, ఇంటర్‌నెట్ సెంటర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. స్టేషనరీ వచ్చిన వెంటనే కార్డులు ప్రింట్ చేసి పోస్టు ద్వారా పంపుతామన్నారు aprtacitizen.epragathi.org లో మీ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ డౌన్లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలని అని విజ్ఞప్తి చేశారు.

నకిలీ పట్టాల విక్రేతలపై చర్యలు

పోరుమామిళ్ల టౌన్ : రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1271/5 సర్వే నెంబర్లలో హోటల్ గురయ్య తన బినామీల పేర్లతో నకిలీ పట్టాలు సృష్టించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భైరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. 2007లో హోటల్ గురయ్యకు తన భార్య కొమర్ల లచ్చుమ్మకు, సుందరయ్య కాలనీలో ప్రభుత్వం నుంచి పట్టా వచ్చిందని, 2010లోనూ వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వారిని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం పోరుమామిళ్ల మండల కమిటీ సభ్యులు బీబీ,లూర్తుమేరీ, రవి, బాల గురయ్యా పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన సదస్సు

కడప : కడప నగరం, 48 డివిజన్ పరిధిలో ఉన్న న్యూ నేటివ్ కృపా కాలనీలో వాలంటీర్ పి.రవితేజ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యం దృష్టిలో వుంచుకొని బాల బాలికలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడి చెత్త, పొడి చెత్త ను వేరు చేసే పద్ధతిపై, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై కరపత్రాల ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వందమందికి పైగా చిన్నారి బాలబాలికలు హాజరై తడి చెత్త పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేధం గురించి నేర్చుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్

కడప : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని వేధిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్మెంట్ వల్ల విద్యార్థి విద్యార్థులు గొప్ప చదువులు చదివే వారు అన్నారు. ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నగర నాయకులు విజయ్, జగదీష్ మహేష్, జమ్మలమడుగు నాయకులు ఎన్. బాబు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కడప : క్రైస్తవుల పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకాష్ నగర్‌లో ఎపిపిఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ కడప జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ తాడిపత్రిలో గురువారం చోటు చేసుకున్న సంఘటన దుర్మార్గ మైన చర్య అన్నారు. క్రైస్తవులు కరపత్రాలు పంచుతున్న సమయంలో మతోన్మాదులు కొందరు రెచ్చిపోయి దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది సంవత్సరాల కాలంలో చాలా ప్రాంతాలలో క్రైస్తవులు, దళితులపై, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కమిటీ పాస్టర్లు. కె.సి. డేవిడ్, ప్రభుదాస్, బిషప్ శామ్యూల్ బాబు, విజయ శేఖర్, సందీప్ రాజు, పుష్పరాజు, జానయ్య, యేసయ్య, దేవరాజు, సుందరం పాల్గొన్నారు.

మహిళలను గౌరవిద్దాం : విసి

కడప అర్బన్ : మహిళలను గౌరవించి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా దేశం ప్రగతి బాటలో పయనిస్తుందని వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్య కళావతి అన్నారు. 'అంతర్జాతీయ స్త్రీ హింసా నిర్మూలన వ్యతిరేక దినం"సందర్భంగా శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం లైంగిక వేధింపుల వ్యతిరేక విభాగం (యాంటీ సెక్సువల్ అరాస్మెంట్ సెల్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న సభ్యుల ఒదరూ ప్రతిజ్ఞ చేశారు. మహిళలపై హింసను నిషేధించే చట్టాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయ రాఘవ ప్రసాద్, ప్రిన్సిపల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, యాంటీ సెక్సువల్ అరాస్‌మెంట్ సెల్ సంచాలకులు డా.ఎం. అనిత, సభ్యులు వరప్రభాకర్, రమేష్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

విరివిగా అవగాహన సదస్సులు

కడప : మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషేధం, పరిహారంపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గజ్జల లక్ష్మి, ఎస్‌సిపిసిఆర్ సభ్యులు ఎం. లక్ష్మీదేవి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి ఎం.ఎన్. రాణి అన్నారు. శుక్రవారం కలెక్టరులోని స్పందన హాల్లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లలు, మహిళలు లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, గృహహింస మొదలైన వాటికి గురవుతున్నారు అన్నారు. ఈ దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన దిశ చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. పతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఓలు సునంద, రమాదేవి, ఎస్ఐ జ్యోతి, లక్ష్మీ శ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఓటర్ల అక్రమ నమోదుపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎమ్మెల్సీ ఓటర్ల అక్రమ నమోదుపై చీఫ్ ఎలక్ట్రోలర్ ఆఫీసర్ పరిశీలనకు ఆదేశించి వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా వివరాలన్నీ అందరికీ అందుబాటులో ఉండే విధంగా బహిర్గతపర్చాలని చెప్పారు. నమోదులో జరిగిన అక్రమాలను అరికట్టడానికి పూర్తి స్థాయిలో వెరిఫికేషన్‌కు ఆదేశించి, చర్యలు వెంటనే చేప ట్టాలని డిమాండ్ చేశారు. తిరస్కరింపబడిన ఓటర్ల జాబితాను ప్రకటించాలని తెలిపారు. దీనివల్ల అభ్యంతరాలు చెప్పడానికి, మళ్ళీ దరఖాస్తుచేసుకునేందుకు సులభమవుతుందని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో అనర్హులను ఓటర్లుగా నమోదు దరఖాస్తులను పెద్దఎత్తున నమోదు చేసినట్లుగా ప్రచారం జరుగుతోందని, అర్హుల దరఖాస్తులను తిరస్కరించినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. టీచర్ల లిస్టులు విద్యాసంస్థలవారీగా తెలుసుకొనేందుకు వీలుగా ఫార్మ్‌లోనూ, వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. కలెక్టరు స్థాయిలో ఒక ఆఫీసరు పర్యవేక్షణలో ప్రయివేట్ టీచర్ల దరఖాస్తులన్నీ పున:పరిశీలన చేయాలని తెలిపారు. కడప జిల్లాలో ప్రయివేట్ విద్యాసంస్థ యజమానులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఉన్నందను జిల్లాలో అక్రమాలు ఎక్కువ జరిగాయని తెలుస్తోందని చెప్పారు. పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ నియోజవర్గానికి సంబంధించి ఈ నెల 5 నాటికి 1,82,000 నమోదు కాగా, 7 నాటికి 3,54,300 నమోదు అయ్యాయని పేర్కొన్నారు. టీచర్ నియోజకవర్గానికి సంబంధించి 5 నాటికి 22,000 నమోదు కాగా 7 నాటికి 30,298 చేరాయని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి 12 గంటలలోపు 4వేల టీచర్ ఓట్లు, 75 వేల గ్రాడ్యుయేట్ ఓట్లు చేరాయని చెప్పారు. చివరిదశలో ఇలా నమోదయిన వాటిని ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు.

వ్య.కా.స జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివకుమార్, అన్వేష్



కడప అర్బన్ : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 6వ మహాసభలు మైదుకూరు పట్టణంలో నిర్వహించారు. మహాసభలో నూతన అధ్యక్షులుగా జి. శివకుమార్, జిల్లా కార్యదర్శిగా వి.అన్వేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు డి. వెంకటేష్, కె. నర్సయ్య, సహాయ కార్యదర్శులు ఎస్. గురువయ్య, సురేష్ బాబు, కోశాధికారిగా ఎస్. వీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు గా ఎమ్మడి పోలయ్య, ఇత్తడి నారాయణ, ఓబయ్య, దేవా, రాయప్ప, జయరాజ్, రవణమ్మ తో పాటు ముగ్గురి ని కో ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కడప నగరంలోని పాత బస్టాండ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.అన్వేష్ మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ మహాసభలు జయప్రదంగా నిర్వహించామని చెప్పారు. మహాసభలో రెండు తీర్మానాలు చేశారని తెలిపారు. గ్రామీణ పేదల వలసలు నివారించడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 200 రోజులు పనులు కల్పించాలని, ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ యధావిధిగా కొనసాగించాలని తీర్మానం చేశారు.

ప్రొఫెసర్‌కు ఘన సన్మానం



ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న సహ సిబ్బంది

కడప : విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అహర్ని శలు కృషి చేయాలని జంతు శాస్త్ర శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాజశేఖర్ సూచిం చారు. నిరంతర కృషితో ఏ పనినైనా, ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చునని చెప్పారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలోని జంతు శాస్త్ర శాఖ, కెరీర్ గైడెన్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పురుషుల కళాశాలలో వృత్తి సంబం ధమైన అవకాశాల పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అతిథిగా డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, జంతు శాస్త్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ పి. రవిశేఖర్, అధ్యాపకులు డాక్టర్ ఎం. రమేష్, డాక్టర్ వై. సావిత్రి, డాక్టర్ సి. నరసింహ రావు, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ డి. నాగేంద్ర కుమార్, డి.వి. శ్రీనిత, పీజీ, యుజి విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లను కూల్చడం దారుణం



సమస్యను విన్నవిస్తున్న బాధితురాలు

కడప అర్బన్ : మాసాపేటలో నివసిస్తున్న పేదల ఇళ్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం దారుణమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాన్నం మసాపేటలో కూల్చిన ఇళ్ల బాధి తులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా కడప 26వ డివిజన్ మాసాపేటలో వందేళ్ల నివాసం ఉంటున్న ఇళ్లను నగర పాలక సంస్థ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడంతో కార్మికులు, ప్రజలు, కూలీ నాలి చేసుకునేవారు రోడ్డున పడ్డారని వాపోయారు. పూర్తిగా ఇల్లు కోల్పోయిన వారు ఎక్కడ ఉండాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాసాపేట శివ, సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

లా సెమిస్టర్ పరీక్షలు తనిఖీ

కడప అర్బన్: విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న లా సెమిస్టర్ పరీక్షలను యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య మునగల సూర్య కళావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 21 నుంచి న్యాయవిద్య (లా) 2, 4 ,6, 8 ,10 సెమిస్టర్ల పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల సౌకర్యాల పట్ల ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారన్నారు.

మీడియా కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె



రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాయలసీమ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా కన్వీనర్‌గా ఒ.రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. ఆ మేరకు రెడ్డి కమ్యూనిటీ అధ్యక్షుడు సురేంద్ర ఆదేశాలు జారీ చేశారు. వేంపల్లెకు చెందిన రాజశేఖర్‌రెడ్డిని మీడియా కన్వీనర్‌గా నియమించడంతో పలువురు రెడ్డి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీలో అందరిని కలుపుకొని ఇతర రెడ్డి సంఘాలతో క్రమశిక్షణతోవెళ్లి ముందుకెళతానని తెలిపారు. రెడ్డి జాతి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. రెడ్డి సొసైటీ బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అయా పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపట్టేందుకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు జెఇ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి, సహకరించాలని జెఇ కోరారు.

పాడి రైతులకు సూచనలు

ప్రజాశక్తి - చాపాడు

రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కుచ్చుపాప గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచు సి సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి విజయ్‌కుమార్ పశువులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు రోజుకు 30-40 కిలోల పచ్చిమేత ఇవ్వాలన్నారు. ఇందులో 10-15 కిలోల పప్పుజాతి గ్రాసం ఉండాలన్నారు. జొన్న, సజ్జ, మొక్కజొన్న, చొప్ప లేనప్పుడు 6-8 కిలోల ఎండుగడ్డిని మేతగా వాడితే పాలలో వెన్నశాతం తగ్గకుండా ఉంటుందన్నారు. పొదుగు వాపు వ్యాధి లక్షణాలు, ప్రస్తుత వాన కాలం పశువుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. గ్రామ పశువైద్య అధికారి చలపతి, సిబ్బంది లక్ష్మీ నారాయణ, సిద్ధయ్య, రిలయన్స్ జిల్లా ప్రతినిధి అమీర్, రైతులు పాల్గొన్నారు .

అంబేద్కర్ ఆశయాలను కాపాడుదాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కాపాడదామని ట్రాఫిక్ ఎస్ఐ హాజీవలి పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని నాగార్జున ఎక్సలెంట్ హైస్కూల్ వేడుకలను నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ కుమార్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం


ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని డాక్టర్ లక్ష్మీప్రియ పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు శుక్రవారం 'ఆరోగ్యం-వ్యక్తిగత సమస్యలు-పరిష్కారమార్గం' అనే అంశంపై ప్రముఖ స్త్రీ వ్యాధుల నిపుణులు డాక్టర్ లక్ష్మీప్రియ అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉంటె భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చునని సూచించారు. నెలసరి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిరోజూ గుడ్డు, పాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బాలనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, వైస్ ప్రిన్సిపల్ సుధీర, అధ్యాపకులు యశోద, ప్రవల్లిక, రెడ్డెమ్మ, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిగా చెప్పకోవడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి నిధుల కింద ఎమ్మెల్యే ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లి గ్రామంలో శుక్రవారం మాజీ సర్పంచు నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో బాదుడేబాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదర్‌పల్లెలో రూ.7 కోట్లు అభివృద్ధి చేశామని గత నెలలో నిర్వహించిన గడపగడపలో ఎమ్మెల్యే పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామంలో ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రజలు నడవడానికి కూడా అవకాశం లేదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా అమ్మఒడి, పెన్షన్, వైద్యానికి ఖర్చు చేసిన నిధులను అభివృద్ధి చేసినట్లు వైసిపి నాయకులు పేర్కొనడం దారుణమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ మండల శాఖ అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు రవిశంకర్‌రెడ్డి, మేకల బాబు, సుదర్శన్, మిల్లు శీను, అక్బర్, శేఖర్‌రెడ్డి, ఉమాకాంత్, రామాంజనేయులు, రామ్మోహన్, రజనీకాంత్, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం భోజనం పథకాన్ని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. భోజనం సరిగా లేదని పిల్లలు ఆశ్రమ బాట పట్టిన విద్యార్థులు అని పత్రికల్లో వచ్చిన కథనంపై ఆరా తీసేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను మధ్యాహ్నం భోజనంపై ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పోషక విలువలతో కూడిన మధ్యా హ్న భోజనాన్ని అందిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అనంతరం సిబ్బం దికి పలు సూచనలు చేవారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. డిఆర్ డిఎ, ఎపిఒ ప్రకాష్‌రావు విచారణలో పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులూ ఉన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ

మైదుకూరు : పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం పట్టణంలో చేపట్టారు. కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కడప కార్యాలయం వారు ఏర్పాటు చేశారు. డిఆర్‌ఒ, ఆర్‌డిఒ జాతీయ రహదారి అభివృద్ధి విభాగం అధికారులు పాల్గొన్నారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ భారతమాల పరియోజన ఫేస్-1. ఫెస్-2 6 లైన్ గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్ కంట్రోల్ ఎకానమిక్ కారిడార్ 1. కోడు రు (సత్యసాయి)-కొత్తపల్లి (మైదుకూరు, వైఎస్ఆర్) వరకు 0 కిలోమీటరు నుం డి 160 కిలోమీటరు వరకు. ఫేస్-2 కొత్తపల్లి (మైదుకూరు వైఎస్ఆర్ జిల్లా) ఉప్పలపాడు వరకు, కడప-బెంగళూరు-విజయవాడ 160 కిలోమీటరు నుండి 226 కిలోమీటర్లు ప్రాంతాల వారీ నుండి అనుమతులు కోరామన్నారు.

లింగ వివక్షతను నిర్మూలించాలి

వేంపల్లె: లింగ వివక్షతను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం లింగ వివక్షతకు వ్యతిరేకంగా డ్వాక్రా మహిళ సంఘాల ఆధ్వర్యంలో వేంపల్లెలో ర్యాలీ నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, ఎపిఎం బాలస్వామి పాల్గొన్నారు.

ఇరుక్కున్న ట్యాంకర్.. నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని కలమల్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రోడ్డు బురద, గుంతలతో అధ్వాంగా తయారైంది. వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. చిలమకూరు నుండి ఆర్‌టిపిపికి పోవు ప్రధాన రహదారి కావడంతో వందలాది లారీలు తరచూ రాకపోకలను సాగిస్తుంటాయి. ఇవికాక ఐసిఎల్ కర్మాగారినికి సంబంధించిన క్వారీ రైల్వే ట్రాక్ అవతలి వైపున ఉండడంతో పెద్ద పెద్ద డంపర్లు, టిప్పర్ల ద్వారా ఆ క్వారీ నుండి ఈ రహదారి గుండా కర్మాగారానికి సున్నాపురాయిని తరలిస్తుంటారు. రోజూ వందల మంది కార్మికులు, ఉద్యోగులు అటు వైపున ఉన్న ఆర్‌టిపిపికి గాని, ఇటు వైపున ఉన్న ఐసిఎల్ కర్మాగారానికి గాని వస్తూ వెళ్తూంటారు. పెద్ద పెద్ద వాహనాలు అధిక లోడ్ వేసుకుని వెళ్లడం ద్వారా రోడ్డు గుంతలుగా తయారైంది. దీనికితోడు వర్షాలు పడడంతో రోడ్డు మొత్తం బురదతో నిండి పోయింది. ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో స్లిప్ అయి పడిపోతున్నారు. అయినా కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు గాని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఆర్‌టిపిపి నుండి ఫ్లయాష్ ట్యాంకర్లు బురదలో కురుకుపోవడం, మరోవైపు నీళ్ల ట్యాంకర్‌తో ట్రాక్టర్ బురదలో ఇరుక్కుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిపిఐ, సిపిఎం, యుఐటిసి, ఎఐటియుసి ఆధ్వర్యంలో పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు పనులు మొదలు పెడుతున్నామంటూ ఆరు నెలలుగా ప్రకటనలు చేసి, నామమాత్రంగా కాలువ పనులు చేసి కొద్ది రోజులకే ఆ పనులను కూడా ఆపే శారని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి త్వరితగతిన రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



బురదలో ఇరుక్కున్న ఫ్లయాష్ ట్యాంకర్

జగన్ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో విద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఎపిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు ఒక పూట కూడా కడుపు నిండా తిండి పెట్టలేని ప్రభుత్వం ఒక ప్రభుత్వమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని బ్రహ్మంగారిమఠంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం కింద వండిన సాంబారు అన్నం తినలేకపోయారన్నారు. నాలుగు కిలో మీటర్ల దూరంలో గల అచలానంద ఆశ్రమానికి పోయి భోజనం చేయడం దురదృష్టకరమన్నారు.



ఎపిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

3,4,5 తరగతులను ప్రాథమిక విద్య నుండి విడగొట్టి హైస్కూల్ విద్యలో విలీనం చేయడం ఒక పిచ్చి తుగ్లక్ చర్య అని విమ ర్శించారు. ఈ చర్య వల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గి, ప్రయివేట్ పాఠశాలలో పెరగడం గమనార్హమన్నారు. పాఠశాల విద్యలో మాతృభాష తెలుగు మాధ్య మాన్ని రద్దు చేసి, తెలుగు మాధ్యమ ఉపా ధ్యాయులచే ఆంగ్ల పాఠాలు బోధించడం ఒక చారిత్రిక తప్పిదమని విమర్శించారు. ఎయిడెడ్, ప్రయివేట్ పిజి కళాశాలల్లో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు రద్దు చేయడం ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని తెలి పారు. మేన మామగా ఉంటానంటూ ముఖ్య మంత్రి జగన్ విద్యార్థుల పట్ల శకుని మేన మామలా, కంస మేనమామలా తయారుకావడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు.

పోరాటం ఉధృతం : ఆర్‌టిపిపి జెఎసి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో కాంట్రాక్టు కార్మికుల నిరసన కార్యక్రమం శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. ప్రాజెక్ట్ మెయిన్ గేట్ వద్ద జెఎసి ఆధ్వర్యంలో వారు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికి 163 జిఒ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ఉద్యమాన్ని విద్యుత్ రంగానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జెన్‌కో స్టేషన్‌లలో ఉధృతం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి ఆర్‌టిపిపిలోని సిఐటియు,1104, 327, 1535, టిఎన్‌టియు, హెచ్ 129, విద్యుత్‌చ్ఛక్తి, ఎఐటియుసి, బిఎమ్‌ఎస్ ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి. 600 ఎండబ్ల్యు గేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు కూడా నాలుగవ రోజుకు చేరాయి. ఈ దీక్షలో రామ కష్ణయ్య, కొండయ్య, రామశేఖర్, సుబ్బారాయుడు, యేసయ్య కూర్చున్నారు. దీక్షలకు టిడిపి, వైసిపి నాయకులు తమ సంఘీభావాన్ని తెలిపాయి.



ప్రాజెక్ట్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు



ఎండబ్ల్యు గేట్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న భూ నిర్వాసితులు

వైఎస్ ఆశయ సాధనే లక్ష్యం : ఎమ్మెల్యే



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆశయ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నవశకం పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా నేతృత్వంలో శుక్రవారం 150వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మైదుకూరు రోడ్డులోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇర్ఫాన్‌బాషా గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, మిఠాయిలు తినిపించారు. వినూత్నంగా గుర్రపుబండ్లు, డప్పులు, మేళతాళాలు, బాణసంచాతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి నుండి తనపట్ల ముస్లింలు ఎనలేని అభిమానాన్ని చూపుతున్నారని తెలిపారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా మైనార్టీలకు అండగా నిలుస్తానన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనతి కాలంలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారురెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యుడు మారుతీప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద, యాకోబు, వైసిపి మహిళా నాయకురాళ్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఖాజీపేట

కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన ఉండాలని రాష్ట్ర కుష్టువ్యాధి నిర్మూలన జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిపోర్ట్స్, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన తగు ఇచ్చారు. మండలంలోని ఆంజనేయకొట్టాలు గ్రామంలో కుష్టు వ్యాధిపై చేస్తున్న సర్వే గురించి సిబ్బంది, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ దేవసాగర్, జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ సర్వే డిశంబర్ 5వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధీ చికిత్స ద్వారా నివారించవచ్చునని తెలిపారు. 6నెలల నుండి 12 నెలల వరకు చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఫిజియోథెరపిస్ట్ విక్టర్ మనోహర్ మాట్లాడుతూ ఈ వ్యాధిపై ఇంటింటికి వెళ్లి ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, ఎఎన్ఎంలు అనుమానితులను గుర్తించి వారిని వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పంపాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల పని తీరును అభినందించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం ,సిహెచ్ఒ వెంకట సుబ్బమ్మ, ఆశ నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ సునీల్‌కుమార్, కృష్ణప్రియ, యంఎల్‌హెచ్‌పి సునీలా, ఎఎన్ఎం రాధ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ దేవసాగర్

రోడ్లు, డ్రైయినేజీ వెంటనే నిర్మిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైదుకూరు

రోడ్లు, డ్రయినేజీలను వెంటనే నిర్మిస్తామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ ఆవరణలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం నిర్వహించిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా డ్రయినేజి రోడ్లపై 16వ వార్డు కౌన్సిలర్ బి.నాగేశ్వరి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర మాట్లాడుతూ ఈ కౌన్సిల్ సమావేశానికి సంబంధించి రూ.60 కోట్లు ప్రతిపాదనను కౌన్సిల్ ముందర పెడుతున్నామన్నారు. నిధులు మంజూరు చేసిన సిఎం జగన్‌కు, ఎమ్మెల్యేక ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో డ్రయినేజి, రోడ్లు పనిని వెంటనే చేసేలా అధికారులను ఆదేశి స్తామన్నారు. తర్వాత సమావేశం జనవరి 8న ఉంటుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో పార్టీలకతీతంగా కౌన్సిలర్లు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

కల్తీ ఎరువులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు

- జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లాలో కల్తీ క్రిమిసంహారక మందులను, రసాయనక ఎరువులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయశాఖ అసిస్టెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే విక్రయించాలన్నారు. దుకాణ యజమానులు ధరల పట్టికను తప్పనిసరిగా ప్రకటించాలన్నారు. ఏరోజుకారోజు స్టాక్ నమోదును తప్పనిసరిగా రిజిస్టర్‌లో పొందుపరచాలన్నారు. కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా దుకాణ యజమానులు బిల్లులు ఇవ్వాలని సూచించారు. నిత్యం జిల్లాలో ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు, పులివెందుల వ్యవసాయ శాఖ ఆక్షన్ డైరెక్టర్లు తరచూ దుకాణాలను తనిఖీ చేస్తున్నారన్నారు. ముందుగా ఆయన లింగాల మండలంలో పర్యటించారు. కార్యక్రమంలో ఎడి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడి నాగేశ్వరరావు

27న రచయిత రావిశాస్త్రి శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రముఖ రచయిత రావిశాస్త్రి శత జయంతి వేడుకలను ఈనెల 27న స్థానిక రోటరీ క్లబ్ ఐ హాస్పిటల్ పైన సభ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పొద్దుటూరు సాహిత్య ప్రేమికులు, ప్రజలు అందరూ పాల్గొనాలని వారు కోరారు. ఆ మేరకు కమిటీ సభ్యులు కరపత్రాలను ఆవిష్క రించారు. కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి, తవ్వా సురేష్, రాజేష్, మురళి, సు నీత, వరలక్ష్మి విరసం, పద్మ చైతన్య, మహిళా సంఘం, రాయలసీమ మహిళా శక్తి లక్ష్మీదేవి, దాదాహయత్ (రచయిత న్యాయవాది), సూర్యనారాయణరెడ్డి, ప వన్, జెవివి సభ్యులు, అధ్యాపకుడు దస్తగిరి, తెలుగు రాజశేఖర్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా సెమీ క్రిస్మస్

ముద్దనూరు : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ముందస్తుగా శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ దేవసహాయం, స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న సిఎస్ఐ (ఎస్‌పిజి) చర్చిలో రెవర్ పాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్సిఎం, హెబ్రోన్, హోసన్నా, మన్నా, గుత్తిశాల ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహనే పరమౌషధం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మధుమేహం (చక్కెర వ్యాధి)పై అవగాహన ఉండడమే దాని నివారణకు పరమౌషధమని సివి రామన్ సైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వై.గోపినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. తాళమాపురం జడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం చక్కెర వ్యాధి అవగాహన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహంపై మనం ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా దాంతో పలు రకాల సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. దీన్ని ముందుగానే గుర్తించి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త డి.వి.సుబ్బానాయుడు మాట్లాడుతూ నేడు ప్రజల జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్ల చక్కెరవ్యాధి ఎక్కువగా కనబడుతోందన్నారు. మంచి జీవనశైలిని, నియమాలు పాటిస్తూ నియంత్రించవచ్చన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు ప్రదర్శనల ద్వారా మధుమేహంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు నిర్మల, కళావతి, నీలమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగింత

వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శ్రీ ఈశ్వర్‌సాయి మృతదేహాన్ని అధికారులు తల్లిదండ్రులకు అప్పగించారు. మతదేహానికి శుక్రవారం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. విద్యార్థి తల్లిదండ్రులు నాగభూషణం, ఇరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆర్‌కె వ్యాలి ఎస్ఐ రంగరావు తెలిపారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు, మనస్పర్థలు లేవని విద్యార్థి తల్లిదండ్రులు చెప్పారు. మూడు నెలల నుంచి మా అబ్బాయి మానసిక ఒత్తిడితో ఉన్నట్లు తోటి విద్యార్థులు సమాచారం అందించినట్లు వారు తెలిపారు. ఎవరిపైనా ఎలాంటి అనుమానాలు లేవని, కేవలం ఒత్తిడి కారణంగానే బలన్మరణానికి పాల్పడి ఉంటాడని వివరించారు. విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌పిఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా వెంకటేష్

పులివెందుల రూరల్ : కాపు (బలిజ) కుల సంఘం రాయల్ పీపుల్స్ ఫ్రంట్ పులివెందుల నియజకవర్గం కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీపతి వెంకటేష్‌ను నియమిస్తూ ఆ సంఘం అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డి శేఖర్ రాయల్ ఉత్తర్వులు అందజేశారు. ఆ మేరకు వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బలిజ కులం అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతానని తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనని ఆయన పేర్కొన్నారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వాజ్‌పేయి నగర్‌లో ఆక్రమిత ఇళ్లను కూల్చివేత రసాబాసగా మారింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు దండు వీరయ్య మాదిగ, వాజ్‌పేయి నగర్ వాసులు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీరయ్య మాదిగ మాట్లాడుతూ తహశీల్దార్ నజీర్‌అహ్మద్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించి దుర్భాషలాడిన ఆయనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు తహశీల్దార్ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు లక్షుమయ్య పాల్గొన్నారు.